నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం అక్టోబర్ 09, 2024 www.navatelangana.com

శ్రీరాంసాగర్ 4 గేట్లు ఎత్తివేత

- ప్రాజెక్టులోకి 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-మెండోర

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 4 గేట్లను ఎత్తి 12496 క్యూసెక్కుల నీటిని గొదావరి నదిలోకి వదులుతున్నారు. ఎస్కేప్ గేట్లు ద్వారా 1200 క్యూసెక్కుల నీరు గొదావరి లోకి వదులుతున్నారు. వరద కాలువకు 12 వేల క్యూసెక్కులు, 6800, లక్ష్మి కాలువకు 150 క్యూసెక్కులు , సరస్వతి కాలువ కు 500 క్యూసెక్కుల నీటిని వదులుతూ మిషన్ భగీరథ ద్వార 231 క్యూసెక్కుల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు నుండి 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకుని 1091 అడుగులు 80.501 టిఎంసిల నీటిమట్టం కలిగి ఉంది. గోదావరి నదిలోకి నీటివిడుదల మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నందువల్ల చేపలు పట్టేవారు, పశువుల కాపర్లు సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ నదిలోకి దిగొద్దని, ప్రమాదానికి గురికావద్దని ప్రాజెక్టు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెస్ పోటీలతో మెదడుకు పదును

నవతెలంగాణ-భీంగల్ రూరల్



పురస్కరం, ప్రశంసాపత్రం అందజేత

మండలంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన మోహన్‌కు మొదటి బహుమతిగా 5 వేల రూపాయలు, రెండవ బహుమతి రాజాగౌడ్ రూ. 2 వేలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షఫీ, బాబాపూర్ మాజీ ఎంపీటీసీ సుర్జిల్ మాట్లాడుతూ చెస్ పోటీలతో మెదడుకు పదును పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రణీత్, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

విడివిడిగా సన్నాలు, దొడ్డురకం తూకం

- వేర్వేరుగానే సంచుల్లో నింపాలి
- కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రాకుండా చూడాలి : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని విడివిడిగా సంచుల్లో నింపాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాక్స్ సిఈఒలు, ఐకేపి సెంటర్ ఇన్చార్జిలు, వ్యవసాయ శాఖ వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యం పరిశీలించి సన్న రకం, దొడ్డు రకంలను విడివిడిగా నింపాలని తెలిపారు. ప్రతీ సంచిపై సెంటర్ కోడ్, జిల్లా కోడ్ వేయనున్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్, గన్నీ బ్యాగ్స్ తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని అన్నారు. వర్షాల వలన ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు ప్రతీ కేంద్రంలో టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు. కొనుగోలు చేశాక ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని అన్నారు. ప్రతీ సంచీపై యూనిక్ నెంబర్ వేయనున్నట్టు తెలిపారు. ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సెంటర్ లలో నిల్వ చేయరాదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా, విజయవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు ధాన్యం తేమ శాతం, ధాన్యం పరిశీలన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహ రావు, జిల్లా సహకార అధికారి తదితరలు పాల్గొన్నారు.

జిల్లాలో మూడు రోజులు పర్యటించనున్న కేంద్ర పవర్ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రటరీ

జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలిం చడానికి కేంద్ర పవర్ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రటరీ బెంజమెన్ కరుణాకరన్ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. జిల్లాలో జలశక్తి కార్యక్రమం కింద వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్ర మాలపై మంగళవారం కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు వివరించారు. గ్రామీణాభివృద్ధి, గ్రౌండ్ వాటర్, అటవీ, నీటి పారుదల, వ్యవసాయం, ఉద్యానవనం శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆయా శాఖాధికారులు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఆచార్య శ్రీకృష్ణ పవార్, అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అటవీ అధికారిని నిఖిత, జడ్పీ సిఈఒ చందర్, డీపీవో శ్రీనివాస్ రావు, జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యాన అధికారిని జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వి. రమ

పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలుచేసి రైతు భరోసా విడుదల చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వి. రమ

నవతెలంగాణ-కామారెడ్డి

రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రమ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా స్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించగా.. ఆమె హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని, గ్రామీణ స్థాయిలో రైతుల వద్దకు వెళ్లి అధికారులు సర్వే చేసి ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయించాలని, రైతు భరోసా ఎకరానికి 15,000 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా వ్యాప్తంగా సీపీఐ(ఎం) శాఖ మహాసభల నుంచి, జిల్లా మహాసభలు ఆల్ ఇండియా మహాసభల వరకు కొనసాగుతున్నాయని మహాసభలలో పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్,కోత్త నర్సింలు, అరుణ్, రాజన్న పాల్గొన్నారు.

మత్స్యకార్మికులకు మెరుగైన ఉపాధి కోసం చేప పిల్లలు విడుదల

- ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి అశోక్ సాగర్‌లో చేప పిల్లలు విడుదల
- దళారులను నమ్మిమోసపోవద్దని సూచన


చేపప్లిలలను నీటిలో వదులుతున్న ఎమ్మెల్యే, అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మత్స్యకార్మిక కుటుంబాల ఉపాధిని మెరుగుపర్చి, వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు గాను నాణ్యమైన చేప పిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. మత్స్య అభివృద్ధి పథకం కింద 2024-2025 సంవత్సరానికి గాను వంద శాతం సబ్సిడీపై చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎడపల్లి మండలం జానకంపేట్ లోని అశోక్ సాగర్ చెరువులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేప పిల్లలను లాంఛనంగా వదిలారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల సమక్షంలో చేప పిల్లల రకాలను, సైజును, నాణ్యతను పరిశీలించి, బరువును తూకం వేస్తూ, ఒక్కోటిగా వాటి సంఖ్యను క్షుణ్ణంగా లెక్కించిన మీదట చెరువులో వదిలారు. ఈ చెరువులో మొత్తం 57,300 చేప పిల్లలు విడుదల చేయగా, అందులో బొచ్చరకం 22,920, రోహు రకం 28,650, బంగారు తీగ జాతికి చెందిన చేప పిల్లలు 5730 ఉన్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 2.27 కోట్ల చేప పిల్లలు చెరువులలో వదలడం జరుగుతోందన్నారు.

చేపపిల్లలు చెరువులో పెరిగి పెద్దవైన తర్వాత మత్స్యకార్మికులు దళారును ఆశ్రయించి నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకార్మికులు ఆలోచించి తమ కుటుంబాలను బాగుపడే విధంగా చూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రతి చోట చెరువులు, ఇతర జలాశయాలలో చేప పిల్లలను వదిలే ముందు మత్స్య కార్మిక సంఘాల సభ్యులు తప్పనిసరిగా వాటి నాణ్యతను పరిశీలించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. నిర్థిత ప్రమాణాలకు అనుగుణంగానే చేప పిల్లలు కేటాయించబడినాయా? లేదా? అన్నది జాగ్రత్తగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఎక్కడైనా తేడా జరిగినా, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఉన్నా వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. చెరువులలో వదులుతున్న ప్రతి చేప పిల్ల బతికేలా నాణ్యమైన చేప విత్తనాలను ఉత్పత్తి చేయిస్తున్నామని అన్నారు.

ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అశోక్ సాగర్ చెరువు చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని, వివిధ చెరువులలో చేపల పెంపకానికి అవరోధంగా మారిన గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ అర్కల నర్సారెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఆంజనేయ స్వామి, మత్స్య కార్మిక సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- కార్మికులకు కనీస వేతనం అమలు చేసి సమస్యలు పరిష్కరించాలి
- యూనియన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు


మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కనీస వేతనం కోసం మున్సిపల్ కార్మికులు పోరుబాట పట్టారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పుకనుగునంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళ వారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు పెద్ద ఎత్తున స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి బైఠాయించి నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా యూని యన్ గౌరవాధ్యక్షులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ ఇచ్చిన సూచన ప్రకారం నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. అదేవిధంగా కేటగిరీల వారీగా వేతనాలను ఇవ్వాలని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ సంస్థల్లో పని చేసే కార్మికులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

స్థానికంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు మున్సిపల్ కమిషనర్‌కు అధికారులకు తెలియజేసినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రధానంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు నెలనెలా ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, సంవత్సరానికి రెండు జతలు చెప్పులు బట్టలు ఇవ్వటంలో నిర్లక్ష్యం కనబరుస్తు న్నారని బట్టల కుట్టుకూలీ కూడా ఇవ్వటం లేదని ఆయన విమర్శించారు. అదేవిధంగా చనిపోయిన కార్మికులకు 20,000 రూపాయలు దహన సంస్కారాలకు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు జరపటం లేదని తెలిపారు. ఇప్పటి వరకు కార్పొరేషన్ పరిధిలో 25 మంది కార్మికులు చనిపోయారని, వారి కుటుంబాలకు పైసా సహాయం అందలేదని తెలిపారు. ఇతర అనేక కార్పొరేషన్లు శానిటేషన్ ఉన్న డ్రైవర్లకు ప్రభుత్వం పెంచిన వెయ్యి రూపాయలను అమలు జరుపుతున్న ప్పటికీ నిజామాబాద్ నగర కార్పొరేషన్ మాత్రం అమలు జరపటం లేదని ఇది కార్మికుల పట్ల వివక్షే అవుతుందని అన్నారు. అధికారులకు కార్మికుల పట్ల వైఖరి మారాలని సమస్యలను ప్రశ్నించిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరిం చని ఎడల తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు భూపతి, ఏక్ నాథ్, సంతోష్ సింగ్, మోహన్, సూర రవి, గంగ శంకర్, శ్రావణ్, వెంకటేష్, మహేష్, సదానంద్, లక్ష్మణ్, నరేష్, సంతోష్ గౌడ్, ఎల్లయ్య రాము, వినోద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

కార్యదర్శికి నోటీసులు.. బీపీఎంపై విచారణ



- చనిపోయిన వారి పెన్షన్ తీసుకుంటున్న వైనంపై నవతెలంగాణ కథనం నేపథ్యంలో చర్యలు


పోస్టాఫీస్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ-ధర్పల్లి

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని సీతాయిపేట గ్రామపంచాయతీలో చనిపోయిన వ్యక్తుల పేరున పెన్షన్ కాజేస్తున్నట్లు నవతెలంగాణ పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి స్పందించి అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహించిన విషయం తెలిసిందే. దీంతో ఆ రెండు శాఖల అధికారులు జరిగిన ఘటనపై చాల సీరియస్‌గా విచారణ చేపట్టుతున్నారు. మండల అధికారులు సోమవారమే సంబంధిత కార్యదర్శికి నోటీసులు జారీచేసి వివరణ కోరగా, మంగళవారం పోస్టల్ అధికారులు ధర్పల్లి పోస్టు ఆఫీసులో విచారణ చేపట్టు తున్నట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సీనియర్ పోస్టు అసిస్టెంట్ అధికారి జనార్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం అయన ధర్పల్లి సబ్ పోస్టు ఆఫీసు పరిధిలోని 1 పోస్టు మెన్‌తో ఉదయం పదిగంటల నుండి సమావేశం ఏర్పాటు చేసి విచారణ కొనసాగించారు. జరిగిన సంఘటనపై నవతెలంగాణ అధికారికి వివరణ కోరగా విచారణ జరుగుతుందని, పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. పెన్షన్ డబ్బులు రికవరీ చేయించామని, తెలిసి జరిగిందా..? తెలియకుండా జరిగిందా అనే కోణంలో విచారణ చేపడుతున్నట్టు దీనితోపాటు ఈనెల 11న పిల్ఐడి అని పోస్టల్ కార్యక్రమాన్ని ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించబోతుందని, దానికి అనుగుణంగా మా సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి అవగాహనా కల్పించినట్టు తెలిపారు. గ్రామాల్లో పెన్షన్ 2వేల 16 కు బదులు, 2 వేల రూపాయలు ఇస్తున్నారని, అలాగే ప్రయివేటు వ్యక్తులు పంపిణీ చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నట్టు ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. అలాంటిదేమీ తమ దృష్టికి రాలేదని, ప్రయివేటు వ్యక్తులు పనులు చేయడానికి వీలు లేదని అన్నారు. ఎవరైనా పైన చిల్లర డబ్బులు ఇవ్వని యెడల లిఖితపూర్వకంగా తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ధర్పల్లి పోస్ట్ మాస్టర్ నితిన్ రెడ్డి. సబ్ పోస్ట్ మెన్లు ఉమేందర్, బాలకృష్ణ, ఖుర్షిద్, లింగం, సంతోష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత

- సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి వావా
- కలెక్టరేట్లో అధికారులతో సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


సమావేశానికి హాజరైన కమిషన్ సభ్యులు, అధికారులు

అనునిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుధ్య కార్మికుల భద్రతా, సంక్షేమానికి ఎనలేని ప్రాధ్యాన్యత ఇవ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆయన ఆయా శాఖల జిల్లా అధికారులతో సమావేశమై పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల గురించి కమిషన్ సభ్యులు పి.పి.వావా అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకోవడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు, 530 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య కార్మికులు ఇంటింటి చెత్తను సేకరించి, వాహనాల ద్వారా డంప్ యార్డులకు తరలిస్తున్నారని వివరించారు. కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు వారి పిల్లలకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్య కోసం రూ.20 లక్షల వరకు ఆర్థిక చేయూతను ప్రభుత్వం తరపున సమకూరుస్తున్నామని తెలిపారు. కాగా, సఫాయి కర్మచారీలకు సంబంధించి జిల్లాలో గత 15 సంవత్సరాల కాలం నుండి ఎలాంటి అట్రాసిటీ కేసులు నమోదు కాలేదని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ కమిషన్ సభ్యుని దృష్టికి తెచ్చారు. 2010 లో చివరి అట్రాసిటీ కేసు నమోదు అయ్యిందని, ఇద్దరు బాధితులకు నష్టపరిహారం సైతం ఇప్పించనున్నట్టు తెలిపారు.

ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు పి.పి.వావా మాట్లాడుతూ.. మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కృషి చేయాలన్నారు. వారి పునరావాసానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని, బీమా సౌకర్యం, పీ.ఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులకు అమలు చేస్తున్న కార్యక్రమాలను, సేఫ్టీ కిట్లను పరిశీలించారు. కమిషన్ సభ్యుని వెంట కేంద్ర సామాజిక న్యాయ విభాగం సభ్యులు గిరేందర్ నాథ్, కోఆర్డినేటర్ చరణ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నిలిపి ఉన్న ట్రాక్టర్ కదిలి బోల్తాపడి బాలుడు మృతి



- తండాలో విషాదఛాయలు

నవతెలంగాణ-లింగంపేట్




అప్పటి వరకు ఆడుతూపాడుతూ కండ్ల ముందు కదలాడిన బాలుడు.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి మృతిచెందిన ఘటన బోనాల జీపీ పరిధిలోని బోనాలతండాలో విషాదం నింపింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బోనాల తాండకు చెందిన రమావత్ భాస్కర్ తన సొంత ట్రాక్టర్‌ను తన ఇంటి సమీపంలోని తండాకు వెళ్లి రహదారిపై దిగుడు ఉన్న ప్రదేశంలో ట్రాక్టర్ను గేర్లు వేసి నిలిపివేశారు. కాగా అతడి కుమారుడు రిషికేష్(5) ఇంటి వద్ద ఆడుకుంటూ ట్రాక్టర్‌పైకి ఎక్కి గేర్లను తీయడంతో దిగుడు ఉండడంతో వేగంగా ముందుకెళ్లి సమీపంలోన పంట పొలంలో బోల్తాపడింది. బాలుని తలకు, ముక్కుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ వెళ్తున్న క్రమంలో దాన్ని ఆపేందుకు స్థానికులు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

పండుగపూట జీతాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తాం

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాల స్పష్టీకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

పండుగ పూట జీతాలు ఇవ్వకుంటే విధులను బహిష్కరిస్తామని అని ఆశాలు స్పష్టం చేశారు. బతుకమ్మ దసరా పండగ సందర్భంగా మహిళా కార్మికులకు వేతనాలు ఇవ్వరా అని అని ప్రశ్నించారు. ఆశాలకు సెప్టెంబర్ నెల పారితోషికాలు, లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత రెండు నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ప్రతినెలా పారితోషికాలను నెల చివరి తేదీన చెల్లించింది. ఇదే పద్ధతిలో సెప్టెంబర్ నెల పారితోషికాలు కూడా సెప్టెంబర్ నెల చివరి తేదీన అకౌంట్లో పడతాయని ఆశాలు ఆశించారని, కానీ ఇప్పటికీ ఇవ్వలేదని తెలిపారు. పండుగల వేళ జీతాలు ఇవ్వకుంటే వేడుకలు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. సెప్టెంబర్ నెల పారితోషికాలతో పాటు 2023, 2024 రెండు సంవత్సరాల లెప్రసీ సర్వే, 2024లో చేసిన పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు మొత్తం చెల్లించి ఆశాలను రాష్ట్ర ప్రభుత్వం పండుగల సందర్భంగా ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక, సుకన్య, స్వప్న, లలిత, శోభ, తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతులు ఇప్పిస్తా

- బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



బతుకమ్మ, దసర పండుగల సందర్భంగా డీజేలకు అనుమతులు ఇప్పిస్తానని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల డీజే నిర్వాహకులు ఆయనను కలిశారు. డీజేలకు అనుమతి లేకపోవడంతో ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సునీల్ కుమార్ వెంటనే ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి పిలిపించి మాట్లాడారు. బతుకమ్మ, దసరా పండగలకు డీజేల నిర్వహణకు అనుమతించాలని కోరారు. నవంబర్ ఒకటి తరువాత డీజేల యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని ఈ సందర్భంగా ఏసీపి వెల్లడించారు.

టెక్నో సాఫ్ట్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పిస్సమల్లన్న ఆలయం వద్ద టెక్నో సాఫ్ట్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ రంగురంగుల పూలతో త్రివర్ణాకారంలో బతుకమ్మని పేర్చి చప్పట్లు చరుస్తూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేసినట్టు కరెస్పాండెంట్ జితేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షులు గుజరాతి నివేదను మాట్లాడుతూ తెలంగాణ నూతన రాష్ట్ర ఏర్పడ్డాక ఈ పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తింపు నిచ్చిందని తెలిపారు. నాటి కాలంలో నవాబులు, భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవని అన్నారు. వారి అకృత్యాలకు నలిగిపోయి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారని తెలిపారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల వెనుక ఉండే మర్మం ఇదే అని కొనియాడారు. కార్యక్రమంలో టీచర్స్ ఇశ్వరీ, శ్రేయ, అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో తపాలా

నేడు ప్రపంచ పోస్టల్ దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పోస్టు.. కాకి చొక్కా వేసుకొని సైకిల్‌పై ఇంటింటికి తిరుగుతూ పోస్టు అనే గొంతు మాయమైంది. మారుతున్న కాలానుగుణంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విప్లవంతో ఈ మెయిల్స్, వాట్సాప్ అందుబాటులోకి రావడంతో క్రమేనా తోకలేని పిట్ట కనుమరుగవుతున్నది.

కాలం మారుతున్న కొందరు మాత్రం ఉత్తరాలు రాయడం మానుకోలేదు. కాలానికి అనుగుణంగా తపాలా శాఖ సైతం సంస్థను కాపాడుకునేందుకు వివిధ రూపాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నది. అతి తక్కువ ఖర్చుతో... ఉత్తరం అందుకోవడం, రహస్యంగా విప్పి చదువుకోవడం, ఎవరైనా వస్తుంటే దిండి కింద దాచుకోవడం, ప్రేమికులకు ఖర్చులేని ఓ మధురానుభూతి. దూరంగా సైన్యంలోనూ, మరో ఉద్యోగంలోనూ ఉన్న భర్త, కొడుకు ఉత్తరం రాస్తాడని, క్షేమ సమాచారం చెబుతాడని వీధివంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది. ఆధునిక కాలంలో సాంకేతికత అందుబాటులోకి రావడం తో ఉత్తరాలు రాసుకునే తరం అంతరించి పోయింది. ఇంటికి వచ్చిన ఉత్తరాలను పొడవాటి ఇనుప కమ్మికి గుచ్చి ఉంచడం అవసరమైనప్పుడు మళ్ళీ తీసి చదువుకో వడం రెండు మూడు దశాబ్దాల క్రితం ప్రతి ఇంటా ఉండే ది. ఆ రోజుల్లో చాలా తక్కువ ఖర్చుతో సమాచారాన్ని దూర తీరాల్లోని ఆత్మీయులకు చేరవేయడానికి తపాలా రంగం అందించిన సేవలు వెలకట్టలేనివి.

అలాంటి పోస్టల్ శాఖకు సంబంధించి ప్రతి ఏడాది నేడు ప్రపంచ, అక్టోబర్ 10న జాతీయ తపాలా దినోత్స వం నిర్వహిస్తున్నారు. పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా 11, 12, 13 తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పోస్టల్ డే ఏర్పడిందిలా...

గతంలో సమాచార మార్పిడికి క్షేమ సమాచారం తెలుసుకునేందుకు పోస్టు కార్డే ప్రధాన ఆధారంగా ఉండేది. కాల గమనంలో వచ్చిన మార్పులు దీనిపై పెను ప్రభావం చూపాయి. ప్రస్తుతం పోస్టుకార్డు మనుగడ కోసం పోరాడుతున్నది. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు సోషల్ మీడియా ఇతర సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత దీని అవసరం తగ్గిపోయింది. ఈ మెయిల్స్ చాలావరకు ప్రస్తుతం పోస్ట్ కార్డు పాత్రను పోషిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికీ పోస్టుకార్డుని వినియోగిస్తున్నారు. చరిత్రలోకి వెళ్తే మెస్సెంజర్ రూపంలో తపాలా సర్వీసులు ఉండేవి. వీళ్ళ నడిచి లేదా గుర్రాల మీద వెళ్లి రాతప్రతుల్ని సంవత్సరాల్లో అనేక దేశాల వారు జాతీయ తపాలా వ్యవస్థను నెలకొల్పుకొని ఆయా దేశాల నడుమ తపాలా సౌకర్యాల్ని అందించేందుకు, ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నవి. 1878లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్‌గా మారింది. ఇది 1948లో ఐక్యరాజ్యసమితికి ప్రత్యేక ఏజెన్సీగా రూపాంతరం చెందింది. 1969 అక్టోబర్ 1 నుంచి నవంబర్ 16 వరకు జపాన్, టోక్యోలో అనేక సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రతినిధులు అక్టోబర్ 9వ తేదీన వరల్డ్ పోస్టల్ డే ను నిర్వహించాలని తీర్మానించారు.



ఉమ్మడి జిల్లాల్లో...

జిల్లా కేంద్రంతోపాటు కామారెడ్డి, ఆర్మూర్‌లో ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. హెడ్ పోస్టాఫీస్ ఆధీనంలో 16 సబ్ కార్యాలయాలు ఉన్నాయి. బాల్కొండ, కిసాన్ నగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్ట్, కమ్మర్పల్లి, మోర్తాడ్, భీంగల్, డిచ్‌పల్లి, ధర్పల్లి, మాక్లూర్, నందిపే ట్, తెలంగాణ యూనివర్సిటీ, పోలీస్ బెటాలి యన్ క్యాంప్, ఇందల్వాయి, పట్టణంలోని జిరాయితనగర్ సబ్ కార్యాలయాలు ఉండగా ఆసరా పెన్షన్లు 47 కోట్లు పంపిణీ చేస్తున్నారు.

పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కిషన్ నాయక్, హెడ్ పోస్ట్ మాస్టర్, ప్రధాన తపాలా కార్యాలయం, ఆర్మూర్.



బ్యాంకు, బీమా, ఉత్తరాల బట్వాడా, ఆసరా, ఉపాధి హామీ, రైతు బంధు తదితర సేవలందిస్తున్నాం. మారుతున్న సాంకేతికతో పాటు అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.



పోస్ట్ ఇన్ పో యాప్ ద్వారా..

తపాలా పథకాల పూర్తి వివరాలకు, ప్రస్తుత వడ్డీరేట్ల గురించి, పిఎల్ఐ, ఆర్‌పిఎల్ఐ ప్రీమియం రేట్ల వివరాలకు, ఉత్తరాల ట్రాకింగ్‌కోసం, ఫిర్యాదులు చేయుటకు పోస్ట్ ఇన్ పో యాప్ డౌన్లోడ్ చేసుకోవచ్చు.

పోస్టల్ సేవలు...

ఉత్తరాల పంపిణీ, స్పీడ్ పోస్ట్, ఈ పోస్ట్ సర్వీస్, ఆధార్ నమోదు, ఆలయాల ప్రసాదాల సర్వీస్, కనిష్ట, గరిష్ట పెట్టుబడి పథకం, టైం డిపాజిట్, సుకన్య సమృద్ధి ఖాతా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ నెలవారి ఆదాయం వంటి పథకాలు అమలు చేస్తున్నది. సేవింగ్ అకౌంట్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్, సుకన్య సమృద్ధి అకౌంట్, ప్రజా భవిష్య నిధి అకౌంట్, నెలవారి ఆదాయ పథకం సీనియర్ సిటిజన్ సేవింగ్స్ పథకం, టైం డిపాజిట్ పథకం, కిసాన్ వికాస పత్రం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ అకౌంట్‌లతో పాటు మరెన్నో పథకాలు అందుబాటులో ఉన్నవి. ప్రధానమంత్రి సూర్యగర్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా సోలార్ పవర్ ఉపయోగించి 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సైతం పొందవచ్చు. ఈ పథకంతోపాటు కామన్ సర్వీసెస్ సెంటర్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రతి ఒక్క పౌరుడికి సేవలను అందిస్తుంది. ఈ కామన్ సర్వీసెస్ సెంటర్స్ ద్వారా పాన్ కార్డు, ఎలక్షన్ కార్డు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, రైల్వే విమాన టికెట్లు, ఫస్ట్ ట్యాగ్ సర్వీసులు, గ్యాస్ బుకింగ్ విద్యుత్ బిల్లులు, ఐటీ రీడర్స్ లాంటి సర్వీసులను సైతం పొందవచ్చు..

మెయిల్ సర్వీసులు సైతం

సీత సతీష్ కుమార్, పోస్టల్ అసిస్టెంట్, ఆర్మూర్



ప్రపంచంలో ఏ మూలకైనా ఉత్తరాలు, పార్సిల్స్ అత్యంత వేగంతో, ఖచ్చితత్వంతో చేర వేసేందుకు భారత తపాలా శాఖ మొట్టమొదటిసారిగా మెయిల్ సర్వీస్‌లను ప్రారంభించింది. వీటితో పాటు స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, ఇంటర్నేషనల్ మెయిల్స్ ద్వారా 20 దేశాలకు తక్కువ ధరలతో పంపవచ్చు.

వ్యక్తికి రెండురోజుల జైలుశిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి డయల్ 100కు ఫోన్ చేసిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్ఐ మహేష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతమ్ నగర్‌కు చెందిన రాజేష్ అనే వ్యక్తి ఈనెల ఏడవ తేదీన మద్యం సేవించి డయల్ 100కు ఫోన్ చేసి న్యూసెన్స్ చేశారని తెలిపారు. మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేయాలని తెలిపారు. అనవసరంగా ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృధా చేస్తే కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నగర అభివృద్ధికి కృషి

- మేయర్, అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగర అభివృద్ధికి కృషి చేస్తున్నానని నగర మేయర్ దండు నీతూ కిరణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని 36, 43 డివిజన్‌లలో సుమారు రూ.20లక్షల మున్సిపల్ నిధులతో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, స్థానిక కార్పొరేటర్లు, మేయర్ దండు నీతూకిరణ్ ప్రారంభించారు. నాందేవ్‌వాడ రావుజీ సంఘం ప్రాంతంలో రూ.10లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు, కల్వర్ట్ పనులను ప్రారంభించారు. 43వ డివిజన్ సుభాష్‌నగర్ కాకతీయ ఒలింపియాడ్ స్కూల్ ముందర కాలనిలో రూ.10లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆర్థిక సంఘం నిధుల ఆలస్యం వల్ల జరగవలసిన పనులకు ఇబ్బందులు ఎదురౌతున్న, మున్సిపల్ నిధులతో ప్రయత్నం చేస్తునమన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, స్రవంతి రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు సుదర్శన్‌రెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా పి.కపిల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా పీ.కపిల్‌ను నియమిస్తూ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేక పోతుల నరేందర్ గౌడ్ నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. నిజామాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం యువజన ప్రధాన కార్యదర్శిగా నియామకానికి కృషి చేసిన రాష్ట్ర కార్యదర్శి మూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు అబ్బగోని అశోక్ గౌడ్, జిల్లా అధ్యక్షులు నారా గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వెనుకడిన వర్గాల శ్రేయస్సు కోసం తన వంతు కృషి చేస్తానని కపిల్ పేర్కొన్నారు. అందరి ఆశీస్సులతో బీసీ జాతి కోసం కృషిచేస్తానని వెల్లడించారు.

నగదుతో అమ్మవారికి అలంకరణ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బడా భీంగల్ గ్రామంలో యువ చైతన్య యూత్ దుర్గ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గా దేవిని రూ.లక్షా యాభైవేల నోట్లతో అలంకరించారు. నాలుగు సంవత్సరాలనుండి అమ్మవారిని ప్రతిష్టాపిస్తున్నారు. మంగళవారం ఆరో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం యువ చైతన్య యూత్ దుర్గ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి
- తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్
- జిల్లా అధ్యక్షులు కటారి రాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ఫ్రీబస్సువల్ల ఉపాధి కోల్పోయి ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కటారి రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రవాణా రంగ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని అన్నారు. వారికి ఇస్తామన్న నెలకు 12 వేల జీవనభృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం ప్రవేశపెట్టడం వల్ల ఆటో రవాణా రంగ కార్మికులు ఉపాధి కోల్పోయారని అన్నారు. ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత మరొక మాట మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాలం గడుపుతుందని ఆయన అన్నారు. అధికారంలోకి వస్తే ఆటో రవాణా రంగ కార్మికులను ఆదుకుంటామని, నెలకు 12వేల జీవన భృతి కల్పిస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది మాసాలు అవుతున్న ఇప్పటివరకు కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆయన విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కోల్పోయి ఆటో కార్మికులు అనేకమంది చనిపోతున్న ప్రభుత్వ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల మరణాలకు కారణం అవుతుందని తెలిపారు. నిన్న ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చొప్పకట్ల పాలెం గ్రామానికి చెందిన పాపారావు పది మాసాల కాలంలో ఆటో నడవక కుటుంబం గడవక ఆర్థిక ఇబ్బందులకు లోనై ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఈ ఆత్మహత్యకు ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులు ఆటో రవాణా రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోవడంలేదన్నారు. చాలాన్ల పేరుతో పోలీసుల వేధింపులతో ఆటో కార్మికులు దినదిన గండంగా బతుకుతున్నారని ఆయన అన్నారు. వీరికోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వ మాత్రం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి గాలికి వదిలేసిందని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఆటో రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వ ఇచ్చిన మాట వెంటనే నిలుపుకోవాలని, వారికి జీవన భృతి 12వేలు చెల్లించాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులు ప్రమాదంలో మరణిస్తే వారికి 10 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలని, మోటార్ వాహనాల చట్టాన్ని సవరించి కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షులు టీ. కృష్ణ, నాయకులు పండరి, సాయి, ఉదయ్, సయీద్ రఫ్యుద్దీన్, మజ్హర్ హుస్సేన్, సయ్యద్ ఇర్ఫాన్, తులసి దాస్, గోవింద్, రమేష్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కటారి రాములు

స్కూల్‌కు బెంచీల వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బిరియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని కాంక్షించే ఏనుగు దయానందరెడ్డి 97 వేల విలువచేసే 25 డ్యూయల్ డెస్క్ బెంచీలను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు, గ్రామ సర్వజన సంఘం సభ్యులు వెంకట రాములు, పల్లికొండ గణేష్, సాగర్, జహీద్ సయ్యద్, ఉపాధ్యాయ బృందం, కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక

నవతెలంగాణ-మోపాల్

మండలకేంద్రలో రైతు వేదిక వద్ద ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24 పనులను పరిశీలించారు. వీటిపై ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి సాయగౌడ్, నారాయణ, స్టేట్ టీం మానిటరింగ్ అంజాద్ అలీ, మండల అభివృద్ధి అధికారి రాములు, ఎంపీఓ కిరణ్ కుమార్, ఏపీవో సునీత, సామాజిక తనిఖీ బృందం, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ అంతరాయానికి కాంగ్రెస్ కారణం అనడం సరికాదు

- బీఆర్ఎస్ పాలనలో ఎబి స్విచ్చులు ఎందుకు బిగించలేదని అడిగారా?
- ఆర్మూర్ చిన్న బాలరాజ్

నవతెలంగాణ-ధర్పల్లి

విద్యుత్ అంతరాయానికి కాంగ్రెస్ కారణం అనడం సరికాదని, బీఆర్ఎస్ పాలనలో ఎబి స్విచ్చులు ఎందుకు బిగించలేదని ఎన్నడైనా అడిగారా అని ఆర్మూర్ చిన్న బాలరాజ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ సబ్ స్టేషన్లో ఎబి స్విచ్చుల కారణంగా తరచూ విద్యుత్ అంతరాయం కలిగిన మాట వాస్తవమేనని అన్నారు. ఇందుకు గ్రామస్థులను కలుపుకొని బీజేపీ స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీని బద్నామ్ చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు. సుమారు 40 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. కరెంటు 24గంటలు అందిస్తున్నామని అన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో సబ్ స్టేషన్‌లలో, ఇతరత్రా అవసరమున్న చోట్ల ఎబి స్విచ్చులను ఏర్పాటు చెయ్యక అధికారులకు, ప్రజలకు ఇబ్బంది పెట్టిన కేసీఆర్ ప్రభుత్వాన్ని వదిలి, కాంగ్రెస్ పార్టీపై బీజేపీ పార్టీ వారు మాట్లాడుతున్న తీరును చూస్తే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల లోపాయికారి ఒప్పందం ఏమిటో ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. నిన్న సబ్ స్టేషన్ లో సాంకేతిక కారణంగా నిలిచిన విద్యుత్ అంతరాయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జిల్లా అధికారులతో సంబంధిత పరికరాలను పంపించి సమస్యను పరిష్కరించారని అన్నారు. కాంగ్రెస్ పదినెలల పాలనలోనే ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి 132 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించారన్నారు. టెండర్ల ఆలస్యం కారణంగా పనులు జరగటం లేదని అన్నారు. త్వరలో విద్యుత్ సమస్య లేకుండా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్, చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, పుప్పాల సుభాష్, బొక్కల బాలయ్య, రతన్ నాయక్, అబ్దుల్ హమీద్, డైరెక్టర్ విట్టల్, పోతరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్మూర్ చిన్న బాలరాజ్

ఇజ్రాయిల్ మృతులకు కొవ్వొత్తులతో నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

గత అక్టోబర్‌లో హమాస్ తీవ్రవాదులు ఇజ్రాయెల్‌లోకి చొచ్చుకు వచ్చి చిన్న పిల్లలు, మహిళలు, వృద్దులు అనే తేడా లేకుండా మానవ మృగాల్లాగా విచక్షణ రహితంగా, దారుణంగా సుమారు 100మంది హత్య చేయబడ్డారని ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు సోమ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపైన లైంగికదాడులు చేశారని, బందీలుగా తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దేశ చరిత్రలో అత్యంత విషాదకర దుర్ఘటన జరిగి నేటికీ సంవత్సరం అవుతున్న నిన్న మొన్న జరిగినట్టు ఆ భయంకర దృశ్యాలు కళ్ళముందు కదలాడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా హమాస్ దాడిలో మృతి చెందిన ఇజ్రాయెల్ పౌరులకు ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక నిమిషం మౌనం పాటించి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కటకం రాకేష్, ప్రధాన కార్యదర్శి వివేక్ ముంబై, మెదక్ యాదగిరి, రాజేష్ దేగాం, మల్లెల గంగాధర్ , రమేష్ రెడ్డి, కేడి రవి, శ్రీనివాస్ గౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన

నవతెలంగాణ-మద్నూర్
మండల కేంద్రంలోని దుర్గమాత మండపాల వద్ద అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్ని మాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కామారెడ్డిలో బతుకమ్మ వేడుకలు

- మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి పట్టణంలోని బతుకమ్మ పండుగ సందర్భంగా మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీ6 ఫేమ్ తీన్మార్ చంద్రవ్వతో పాటు పట్టణ కౌన్సిలర్లు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్

ఎండొస్తే కోత.. వర్షమొస్తే నిలిపివేత

వరికోత సమయంలో వర్షంతో ఆటంకం

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించాలని కోరుతున్న రైతులు



చందూర్ మండల కేంద్రంలో నేలకొరిగిన వరి పంట వద్ద రైతు

వర్ని ఉమ్మడి మండలం (రుద్రూర్, చందూర్, వర్ని, మోస్రా)లో వరి పంట చేతికొచ్చింది. అయితే పంటను కోసేందుకు మాత్రం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వారం క్రితం భారీ వర్షం కురవడంతో పంట నేలకొరిగింది. దీనికి తోడు మంగళవారం సైతం వర్షం కురవడంతో రైతులు వరి పంట కోతను మధ్యలోనే ఆపాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించిన నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నవతెలంగాణ-వర్ని
సరిగ్గా పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలకు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే ఈ నెల 4వ తేదీన ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి చాలా చోట్ల చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. అప్పటి నుంచి రైతులు ఎండ వచ్చిన సమయంలో భూమి ఆరితే కోత కోయిస్తున్నారు. తడిగా ఉంటే.. కోతను నిలిపివేస్తున్నారు. అయితే మంగళవారం సైతం వర్షం కురవడంతో పంట భూమి మరింతగా తడిగా మారింది. దీంతో మిషన్లు తిరిగి కోత కోసేందుకు అనువుగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట నేలకొరగడంతో వర్షం కురిస్తే వడ్లు నేలరాలుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృత్తమై చిరుజల్లులు కురుస్తున్నాయి. పంట చెలలోనే గంటల పరిధిలో కోసే కోత మిషన్లు, ట్రాక్టర్లు నిలిచి ఉంచుతున్నారు. పైగా మిషన్, ట్రాక్టర్ల ధరలు భారం ఎక్కువవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చైన్‌మిషన్‌తో కోత కోయిస్తే గంటకు రూ.2600 ధర ఉంది. రైతులు ఇంత ఆందోళనలో ఉన్నా.. వ్యవసాయ అధికారులు మాత్రం నామమాత్రంగా పంటలను పరిశీలిస్తున్నారు. ఉమ్మడి మండలాలో పంట నష్టం ఎంత జరిగిందో లెక్కలు చేయటం లేదని, పంట నష్టం అంచనా వేయనిది రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఎలా ఇస్తుందని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



మోస్రా మండలం గోవూర్ గ్రామంలో నేలకొరిగిన వరి

తూము మూసే ప్రయత్నంలో చెరువులో పడి రైతు మృతి

నవతెలంగాణ-వర్ని(చందూర్)
చెరువు తూమును మూసే ప్రయత్నంలో కాలుజారి చెరువులో పడి రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాకలి పసుపు శ్రీనివాస్ (38) అనే వ్యక్తి వ్యవసాయ చేసుకుంటూ, కూలీ పని చేసేవాడు. తన పంట చేతికి రావడంతో పంటకు నీరు ఆపేయటానికి చెరువు వద్ద తూమును మూసే ప్రయత్నంలో ప్రమాదశావత్తు కాలుజారి చెరువులో పడి నీటమునిగి ఊపిరాడక మృతిచెందాడు. భార్య సవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పెద్ద ఆత్మకూరు గ్రామానికి చెందిన కిష్టయ్య (50) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఎయిర్టెల్ టవర్ వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై మల్లారెడ్డి వివరాల ప్రకారం.. ఆత్మకూరు గ్రామానికి చెందిన కిష్టయ్య గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఆరు నెలల క్రితం ఆత్మకూరు గ్రామానికి చెందిన వంగరి ప్రభువులు వద్ద పౌల్ట్రీ ఫార్మ్ లీజుకు తీసుకొని పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం రాత్రి పౌల్ట్రీ ఫార్మ్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి మంగళవారం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మంగళవారం వెతకగా చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి భార్య సులోచన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



కామారెడ్డి : పంపిణీ చేసిన చెక్కులతో లబ్ధిదారులు

నవతెలంగాణ-కామారెడ్డి/రామారెడ్డి
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో కామారెడ్డి పట్టణ, రూరల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణరెడ్డి బాధితులకు అందజేశారు. అనంతరం కామారెడ్డి రూరల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత..
రామారెడ్డి : మండలంలోని అన్నారం, పాల్వంచ రైతు వేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. మండలంలోని ఉమ్మడి రెడ్డి పేట గ్రామపంచాయతీ పరిధిలో 19, అన్నారం 4, మద్దికుంట 2 కళ్యాణలక్ష్మి చెక్కులను, సింగరాయపల్లి, మద్దికుంట, అన్నారం, రెడ్డిపేట తదితర గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఆర్ఐ వెంకట్‌రాజు, పంచాయతీ కార్యదర్శి సాగర్‌గౌడ్, సింగరాయిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్‌గౌడ్ తదితరులున్నారు.

బతుకమ్మ వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి
బతుకమ్మ వేడుకలను మండల, జిల్లా కేంద్రాలలో ఘనంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశమందిరంలో బతుకమ్మ వేడుకలు నిర్వహణపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ.. బతుకమ్మ వేడుకలను అధికారికంగా జిల్లాలో నిర్వహించాలని, మండల, జిల్లా కేంద్రాలలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనే విధంగా చూడాలని, జిల్లా వ్యాప్తంగా ఘనంగా సంప్రదాయ రీతిలో పాటలు పాడుతూ బతుకమ్మ ఆటను ఆడే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులను బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములు చేయాలని అన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకను పెద్దఎత్తున నిర్వహించాలని అన్నారు. చెరువులు, కుంటలు తదితర నీటి ప్రాంతాలలో గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో శానిటేషన్ పనులు, విద్యుత్ లైట్‌లను, షామియానాలు, తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులను బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. శాఖల వారీగా అవేర్నెస్ కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, డిఎస్పి నాగేశ్వర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి బావన్న, జిల్లా ప్రణాళిక అధికారి రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఐకెపిడీపీఎం సుధాకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ద్విచక్ర వాహన దొంగల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు, బైక్‌లు

నవతెలంగాణ-రామారెడ్డి
ద్విచక్ర వాహన దొంగలను మంగళవారం పట్టుకొని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లపల్లి స్టేజి వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఇద్దరు అనుమానిత వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా.. మండల కేంద్రానికి చెందిన మెట్టు నవీన్, మెట్టు నరేష్‌ను పోలీసులు పట్టుకొని విచారించారు. నాలుగు ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ అర్హుల జాబితాను సిద్ధం చేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో అర్హులైన డబుల్ బెడ్ రూమ్ జాబితాలను సిద్ధం చేయాలని మండల తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ రఫీ హైమద్‌లు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో రెండు పడకల గదులు పూర్తయిన గ్రామాలతో పాటు, ప్రతి గ్రామంలో అర్హులైన వారి జాబితాలను తయారు చేయాలని వారు ఆదేశించారు. గతంలో చేసిన జాబితాలలో ఎలాంటి పొరపాట్లు జరిగిన మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, పాల్గొన్నారు.

దసరా తర్వాత రోడ్డెక్కుతాం

- బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
దసరా పండగ తర్వాత రోడ్డెక్కి ధర్నాలు చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాంప్రతాప్ థియేటర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు లక్షలలోపు రైతు రుణమాఫీ, రైతుబంధు, వడ్లకు బోనస్ ఇవ్వకుంటే దసరా పండగ తర్వాత రోడ్డెక్కి ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని తెలిపారు. నాగిరెడ్డిపేట్ మండల వ్యాప్తంగా 27 గ్రామపంచాయతీల పరిధిలో ఏ ఒక్క రైతుకి కూడా 2 లక్షల లోపు రుణమాఫీ పూర్తిగా కాలేదని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు సంబంధించి వరి ధాన్యం రైతులు ముందస్తుగా వేశారని, తద్వారా కల్లాలకు వడ్లు చేరాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, మాజీ జెడ్పీటీసి మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు కష్ణ, మైనార్టీ నాయకులు ఫరీద్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మంగలి యాదగిరి, సంతోష్ గౌడ్, వంశీ గౌడ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి.. ఆడబిడ్డలకు వరం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు



చెక్కులు పంపిణీ చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి
షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆడబిడ్డలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను అధికారులు, నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడపల్లి మండలానికి చెక్కులు 58 మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందులో షాదీముబారక్ 20మంది, సామాజికవర్గానికి చెందిన లబ్ధిదారులకు 38 చెక్కులు మంజూరు కావడంతో లబ్ధిదారులకు అందజేశారని తెలిపారు.


పలువురి కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని మద్దికుంటలో పలువురు అనారోగ్యంతో మతిచెందగా వారి కుటుంబాలను జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రమాదంలో మతిచెందిన మేడిపల్లి బాలరాజ్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘోత్తమరెడ్డి, బండి ప్రవీణ్, దుంపల బాలరాజు, నామాల రవి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరకే.. విత్తనాలు, ఎరువులు

- రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చాట్ల గోపాల్
- శనగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్
రైతులకు విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ ధరలకే లభించే విధంగా సంఘం ఏర్పాటు చేసిందని రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చాట్ల గోపాల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎఫ్‌పిఓ ద్వారా శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయదారులు విత్తనాలు, ఎరువులు సరైన ధరలతో రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారానే కొనుగోలు చేయా లని ఆయన సూచించారు. శనగ విత్తనాల బ్యాగు 25 కిలోల బస్తా రూ.2200కు విక్రయిస్తున్నట్లు తెలి పారు. రబీ పంట సాగు కోసం రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి విశాల్‌గౌడ్, సంఘం సభ్యులు, వ్యవసాయ రైతులు, పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న చైర్మెన్

బయో సైన్స్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయునిగా షేక్ గౌస్

- డీఎస్సీలో ఉత్తీర్ణత

నవతెలంగాణ-మద్నూర్
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా డీఎస్సీ పరీక్షల్లో మండల కేంద్రానికి చెందిన శేక్ గౌస్ స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించడంతో శేక్ గౌజ్‌ను గ్రామస్తులు అభినందించారు.



జిల్లా కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-రెంజల్
నిజామాబాద్ జిల్లా నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా ఎంపికైన బీరేందర్ సింగ్‌ను మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ ఆఫీస్ సబార్డినెట్‌గా పనిచేస్తున్న బీరేందర్ సింగ్ జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం తమ కార్యాలయానికే గర్వకారణమని వారు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, మండల పాలన అధికారి హెచ్.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్ హైమద్, వినాయక్, శివప్రసాద్, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-లింగంపేట్/మద్నూర్/బోధన్
మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం దుర్గ మాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహాలక్ష్మి దేవి అవతారంలో దర్శనమిచ్చారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని గాంధీ చౌక్ సమీపంలో గల పాపమ్మ ఆలయం వద్ద మహా అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గల్లీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు.

బోధన్ : బోధన్, సాలూర మండలాల్లో దేవి మండపాల నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. సాలూర మండల కేంద్రంలో సార్వజనిక్ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో.. బోధన్ పట్టణంలోని సరస్వతి నగర్‌లో నల్ల పోచమ్మ మండపం వద్ద అన్నదానాలు చేపట్టారు. సాలూర లైబ్రరీ చైర్మెన్ స్వామిగౌడ్, కండెల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో మొక్కలు నాటిన క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని బతుకమ్మ చెరువు వద్ద పెద్దమ్మ ఆలయ ఆవరణలో పలు రకాల పూలు, పండ్ల మొక్కలను క్లబ్ ప్రతినిధులు నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు గండి మనోజ్ కుమార్, కార్యదర్శి, రాకేష్ వర్మ, డిసి మెర్సీ, కోశాధికారి గంగారెడ్డి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యములో పట్టణంలోని జిరాయత్ నగర్‌లో విద్యా హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అవ్వకు బువ్వ కార్యక్రమంలో పేదలకు 5 కిలోలు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 54 మంది పేదవృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్ ఖాందేష్, ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ.. అవ్వకు బువ్వకార్యక్రమం ద్వారా పేద వృద్ధులకు తమవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. 10ఏండ్ల క్రితం పీజీ చదివిన 18మంది సభ్యులు కలిసి రక్షా స్వచ్ఛంధ సేవా సంస్థను ప్రారంభించి నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందమ్ నరహరి, విద్యా గోపి కృష్ణ కోశాధికారి గొనె శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శులు బేతు గంగాధర్, ఖాందేష్ సత్యం, తులసి పట్వారి, మక్కల సాయినాథ్ సంయుక్త కార్యదర్శి మీరా శ్రావణ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ ఉత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూరు మండలంలోని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలను మంగళవారం నిర్వహించారు. తీరొక్క రంగుల పూలను బతుకమ్మగా పేర్చి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, పిహెచ్ఎన్ వల్లి ఆరోగ్య పర్యవేక్షకురాలు అజీమా, నలిని, ఆరోగ్య కార్యకర్తలు స్వప్న, రాజగంగు, ప్రసన్న, గిరిజ, జమున, శ్రీ వేణి, బీరవ్వ, హేమజ, పద్మలత, సుజాత, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యానికి తావిస్తే చర్యలు

- రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడకూడదు
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హెచ్చరించారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఆయా శాఖల అధికారులతో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలతో, రైస్ మిల్లర్లతో, ఐకెపి సీసీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. ఎక్కడైనా అధికారులు, సిబ్బంది తప్పిదాల వల్ల రైతులు ఇబ్బందులు పడినా, బిల్లుల చెల్లింపులలో జాప్యం చేసినా సంబంధిత అధికారులనే బాధ్యులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతు వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయాలని అన్నారు. వాతావరణ పరిస్థితులలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్న దరిమిలా, వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో 12 వేల వరకు టార్పాలిన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, వారం రోజుల్లో మరిన్ని టార్పాలిన్లు జిల్లాకు రానున్నాయని కలెక్టర్ వివరించారు. వాతావరణ పరిస్థితుల గురించి రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలన్నారు.

ప్రస్తుత ఖరీఫ్ లో పెద్ద ఎత్తున వరి సాగు చేసినందున గతేడాదితో పోలిస్తే ఈసారి 60 శాతం ఎక్కువ పరిమాణంలో ధాన్యం దిగుబడులు సేకరించాల్సి ఉంటుందన్నారు. అలాగే సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కోసం వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈసారి అదనంగా 150 ధాన్యం సేకరణ కేంద్రాలు కొత్తగా అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా వేయింగ్ మెషిన్, ఆన్లైన్ లో వివరాల నమోదు కోసం టాబ్ లు సమకూర్చుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి వసతి వంటి అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. సరిపడా హమాలీలను ఏర్పాటు చేసుకుని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లించనున్నందున ధాన్యం సేకరించే సమయంలో ప్రైవేట్ మార్కెట్ కు చెందిన వ్యక్తుల నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే, సన్న రకం ధాన్యంలో దొడ్డు ధాన్యం కలువకుండా పకడ్బందీ నిఘా, పర్యవేక్షణ ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం నిల్వలు పంపించడానికి ముందు బస్తాలపై ధాన్యం రకం, కొనుగోలు కేంద్రం కోడ్ నెంబర్ తదితర వివరాలను తప్పనిసరి రాయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను సాకుగా చేసుకుని రైతులను నష్టపర్చే ప్రయత్నాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైనందున ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

13న విశ్వ స్ఫూర్తి, విశ్వ కీర్తి అవార్డుల ప్రదానోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య పేరిట విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 13న విశ్వ స్ఫూర్తి, విశ్వ కీర్తి అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్టు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు రాఘవాపురం గోపాల కృష్ణచార్య, మనోహర్ ఆచార్య, పౌడపల్లి రాజారాం ఆచార్యలు మంగళవారం తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ పూర్తి చేసి పాసైన వారు, ఐఐటి నీట్ ఎంసెట్, జె.ఇ.ఇ మెయిన్ 90శాతం పైన నీటు, ఐఐటిల్లో సాధించిన వారు, అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారికి డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన విశ్వబ్రాహ్మణ విద్యార్థిని, విద్యార్థులకు విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలతోనూ, నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విశ్వబ్రాహ్మణ ఉద్యోగులకు సర్వీస్‌లో ప్రమోషన్లు పొందిన వారికి, సర్వీసులో ఉత్తమ పురస్కారాలు పొందిన వారికి, ఆయా శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులకు ఈ సంవత్సరం ఉద్యోగ విరమణ పొందుతున్న విశ్వబ్రాహ్మణ ఉద్యోగులకు ఆయా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న విశ్వబ్రాహ్మణ కళాకారులకు, రచయితలకు, పాత్రికేయ మిత్రులకు, రాజకీయ నాయకులకు విశ్వకీర్తి ప్రతిభా పురస్కారాలు ప్రదానం, సత్కార కార్యక్రమం ఉంటుంది. ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య జిల్లాస్థాయి ప్రతిభా పురస్కారాలకు అర్హులని అన్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోగల అన్ని మండలాల చెందినవారు. 9391044536, 9704496588, నెంబర్లకు నిజాంబాద్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందినవారు 9492481288, 9550469917,నంబర్లకు బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు చెందినవారు 9963290646, 9494961238 నెంబర్లకు బయోడేటాతో పాటు,ఆధార్ కార్డు ఫోటో సంబంధిత ధ్రువపత్రాలు వాట్సప్ ద్వారా ఈనెల 11 వరకు పంపాలని కోరారు.

స్వదేశీ మేళా బ్రోచర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హైద్రాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఈనెల 23నుంచి 27వరకు నిర్వహించబోయే స్వదేశీ మేళా బ్రోచర్లను నిజామాబాద్ అర్బన్ ఎంఎల్ఏ ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా ఐదు రోజులపాటు జరిగే ఈ మేళాలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత పెట్టుబడిదారులకు సదవకాశం అని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సంఘటనా మంత్రి రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వదేశీ జాగరణ మంచ్ సామాజిక సాంస్కృతిక ఆర్థిక రంగ నిపుణుల వేదికని, దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ ప్రభావాలు, నూతన సరళీకృత విధానాలను వ్యతిరేకిస్తూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అన్ని రంగాలవారికి ప్రయోజనాలు చేకూర్చేలా స్వావలంబన విధానాలు రూపకల్పన చేసేందుకే స్వదేశీ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేళా ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని, ఎబివిపి ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రేంజర్ల నరేష్, స్వదేశీ జాగరణ మంచ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ డా.రాహుల్, ప్రతినిధులు, రోషన్,నవీన్, మనీష్, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ కేసు ఇంటి చుట్టూ 50 ఇండ్లలో ఫీవర్ సర్వే చేయాలి

- జిల్లా మలేరియా అధికారి తూకరం రాథోడ్



మాట్లాడుతున్న తుకారాం రాథోడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డెంగ్యూ కేసు ఉన్న చోట ఇంటి పక్కల 50 ఇండ్లలో ఆశా కార్యకర్తలు ఫీవర్ సర్వే చేయాలని తూకరం రాథోడ్ ఆదేశించారు. మంగళవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశానికి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల డెంగ్యూ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల నుంచి ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడేలు చేయాలని ఆశా కార్యకర్తలను ఆదేశించారు. జ్వరం సర్వేలో ఇంటింటికి తిరిగి ఇంటిలో అందరి ఆరోగ్యం గురించి తెలుసుకోవాలని సూచించారు. ఎవరికైనా జ్వరం ఉన్నట్లయితే తక్షణమే వారి ఇంటి వద్దనే ఆర్డిటి పరీక్ష నిర్వహించి వ్యాధిని నిర్ధారించాలని తెలిపారు. ఇంటిపై కప్పున గల నీటి ట్యాంకులను పరిశీలించి మంచి నీటిలో నివసించే దోమల యొక్క లార్వా ఉన్నట్లయితే తొలగించాలని, గ్రామాల్లో వాడవాడలా తిరుగుతూ ఎక్కడైనా నీరు నిల్వగల ప్రాంతాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక ఇవ్వాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. సెప్టిక్ ట్యాంక్ పైపులకు కచ్చితంగా జాలీలు పెట్టాలని ఇంటి యజమానికి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాల ఎంహెల్‌హెచ్‌పిలు ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన సొసైటీ డైరెక్టర్ మృతి



నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట్ మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన గదారి రాజలింగం(54) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఐలాపూర్ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఈయన ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకున్నారు. ఇందుకు సంబంధించిన అప్పులు తీర్చలేక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో పొలానికి తీసుకొచ్చిన పురుగులమందు శుక్రవారం తాగి తీవ్ర అస్తవ్యస్తకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

13 నుంచి కాజీపేట-దాదర్ రైలు

- రైలు నడపాలని రైల్వే మంత్రి, అధికారులను పలుమార్లు కోరిన ఎంపీ అర్వింద్
- అతి త్వరలో రైలు అందుబాటులో వస్తుందని ఎంపీకి తెలిపిన మంత్రి అశ్విని వైష్ణవ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తొమ్మిది నెలల నుండి అయోధ్యకు రద్దు చేసిన కాజీపేట - దాదర్ (07195/96) రైలు ఎట్టకేలకు మళ్లీ పట్టాలెక్కనుంది. దీంతో నిజామాబాద్ పార్లమెంట్‌లోని జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల నుండి వివిధ పనుల అవసరాలకు ముంబై వెళ్లనున్న ప్రయాణికుల బాధలు తప్పనున్నాయి. తొమ్మిది నెలల క్రితం అయోధ్యకు రద్దు చేయబడ్డ ఈ రైలు నడపాలన్న డిమాండ్ గత కొంతకాలంగా వినిపిస్తోంది. ఈ రైలును పునరుద్ధరించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ రైల్వే మంత్రిని అశ్విని వైష్ణవ్‌ను, ఉన్నతాధికారులను పలుమార్లు కోరిన సంగతి తెలిసిందే. 15 రోజుల క్రితం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎంపీ అర్వింద్ మరో మారు రైల్వే మంత్రిని కలిసి ఎట్టి పరిస్థితుల్లో రైలు ప్రారంభించేలా తగిన చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. కొద్ది రోజుల్లో ఈ రైలు పున ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దానికను గుణంగా రైల్వే ఉన్నతాధి కారులు కాజీపేట -దాదర్ రైలును మొదట నవంబర్ 28 వరకు పొడిగించారు. విషయం తెలుసుకున్న అర్వింద్ ఈ రైలును రెగ్యులర్‌గా నడిపించాల్సిం దేనని రైల్వే అధికారులను పట్టుపట్టారు. ఎంపీ అర్వింద్ కోరిక మేరకు ఈ రైలు జనవరి 30వరకు పొడిగిస్తున్నట్టు రైల్వే అధికారులు తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దసర పండుగ సెలవులకు వెళ్తున్నారా..?

- పోలీస్ నిబంధనలు ప్రజలు తప్పక పాటించాలి
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దసరా పండగ సెలవుల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు సెలవులపై వెళితే పోలీస్ నిబంధనలను ప్రజలు తప్పక పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మంగళవారం వెల్లడించారు. ఉదయం వేళ రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు హర్ ఏక్ మాల్ వస్తువులను విక్రయించే వారిపై నిఘా పెట్టాలన్నారు. రాత్రయితే అనుమానంగా సంచరించే వారిని ప్రశ్నించాలన్నారు. శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం, రాత్రి వేళ చోరీలకు పాల్పడటం జరుగుతుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకుంటూ ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలని సూచించారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని వచ్చేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిది అన్నారు. కుటుంబ సభ్యులు వెళ్లగా ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు అపరిచితులు సమాచారం పేరుతో వస్తే నమ్మొద్దని సూచించారు. విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చినమ్మి వెళ్లకూడదని, ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఉంచకపోవడమే మంచిది (లేదా) బ్యాంక్ లాకర్లో పెట్టుకోవడం మంచిది అని తెలియజేశారు. కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి. తాళం వేసి ఊరు వెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలన్నారు.పోలీస్ శాఖ వారికి దొంగతనాలపై అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణ కు సహకరించాలన్నారు. చుట్టు ప్రక్కల వారి ల్యాండ్ ఫోన్ నెంబరు (లేదా) సెల్ ఫోన్ నెంబర్లు తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునేవారు సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించండి. లేదా డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కవులకు ఘన సన్మానం



కవిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మోపాల్

బోర్గం (పి) శివారులో గల శ్రీలక్ష్మి గణపతి మహా ఆలయంలో మంగళవారం దుర్గా నవరాత్రి మహోత్స వాలను పురస్క రించు కుని అమ్మ వారిని వర్ణిస్తూ స్తుతిస్తూ కవులు తమ కవితా గానాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో 20 మంది ప్రముఖ కవులు కవితా గానం చేశారు. వీరిలో బోధన్, కామారెడ్డి కవులు కూడా పాల్గొన్నారు. పబ్బ మురళి, చింతల శ్రీనివాస గుప్త, గంట్యాల ప్రసాద్, గణపతి అశోక శర్మ, మొదలైన సీనియర్ కవులు, బాల కవులు చిరంజీవి రుడావత్ గౌతమ్ రాజు, తుంగపల్లి మధుప్రియ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన డాక్టర్ అరుణ్ కుమార్ శర్మ మాట్లాడుతూ శృంగేరి శ్రీ శారదా పీఠంలో ఏ విధంగా కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తారో అదేవిధంగా ఇక్కడ కూడా శారదా మాత సేవలు చేస్తామని, కవులు తమ కవితలను వినిపించేందుకు శ్రీ లక్ష్మీ గణపతి మహా ఆలయంలో ప్రతి నెలలో ఒక రోజు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ గణపతి అశోక శర్మ మాట్లాడుతూ.. అమ్మవారి వివిధ రూపాలను కొనియాడారు. ఆత్మీయ అతిథి "వైశ్యరత్న" చిటిమెల్ల హరిప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమ ఆవశ్యకత, విశేషాలను ప్రస్తుతించారు. కార్యక్రమానంతరం కవులందరినీ గణపతి శాలువ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ విజయభాస్కర్ గారి దేశం కోసం, ధర్మం కోసం, దుర్గా గణపతి ఉత్సవాలు అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు.

18 ఆర్మూర్ ఏరియా కమిటీ మహాసభ

- సీపీఐ(ఎం) ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నాపురం గ్రామంలో సిపిఐ(ఎం) గ్రామ మహాసభను గోవుల గంగాధర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జెండా ఆవిష్కరణ చేసి అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరికి, ఆర్మూర్ మండల చేపూర్ శాఖ కార్యదర్శి చాకలి నర్సయ్య కు జోహార్లు అర్పించారు. అనంతరం మహాసభలో ఆర్మూర్ ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ సిపిఐ(ఎం) పార్టీ ఆల్ ఇండియా వరకు 2025 ఏప్రిల్‌లో జరుగుతున్నాయని తెలిపారు. వాటికి ముందుగా శాఖలు, డివిజన్, జిల్లా, రాష్ట్ర మహాసభలు జరుపుకోవాలని అన్నారు. జిల్లా మహాసభలు ఈనెల 26, 27 తేదీలలో నిజామాబాద్ పట్టణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈనెల 18న ఆర్మూర్ ఏరియా మహాసభ జరుగుతుందని, ఈ మహా సభకు కేంద్రం నుండి పాలడుగు భాస్కర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేష్ బాబు, పెద్ది వెంకట్ రాములు హాజరవుతారని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. చిన్నపూర్ గ్రామ శాఖ కార్యదర్శిగా గోగుల గంగాధర్‌ను ఏకగ్రవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గొగుల ఎర్ర సాయిలు, మల్లమ్మ, రాధ, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


- రైస్ మిల్లులో డీసీఎం నిండా నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం
- బియ్యం ఎక్కడవని పోలీసుల ఆరా

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్ నగర్ సమీపంలో గల రైస్ మిల్లులో పిడిఎస్ బియ్యాన్ని అధికారులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాస్ నగర్ సమీపంలో గల మహాలక్ష్మి ఇండస్ట్రీస్ రైస్ మిల్లుల్లో మధ్యాహ్న సమయంలో నిజామాబాద్ సిసిఎస్ పోలీసులు ,స్థానిక పోలీసులు జాయింట్ తనిఖీలు నిర్వహించారు. డీసీఎం నిండా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం ఎక్కడివి అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పిడిఎస్ బియ్యం రెగ్యులర్‌గా రైస్ మిల్లుకు సరఫరా చేస్తారా అని అనుమానం వ్యక్తం చేస్తునట్లు సమాచారం. పిడిఎస్ బియ్యం తెచ్చిన వారు రెగ్యులర్‌గా సరఫరా చేస్తాం అని తెలుపుతున్న , సంబంధిత యజమాని కావాలని పిడిఎస్ బియ్యం లోడ్ రైస్ మిల్లుకు తెచ్చి బ్లాక్ చేస్తున్నట్టు సమాచారం.ఈ విషయం పై పోలీసులు సుమారు నాలుగు గంటలుగా ఆరా తీస్తున్న నిగ్గు తేల్చట్లేదు. పూర్తి వివరాల గురించి సంప్రదించగా ఇన్వెస్టిగేషన్ నడుస్తుందనీ, పూర్తి వివరాలు తెలియలేదని వెల్లడిస్తున్నారు. ఈ రైస్ మిల్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సోదరుడు నిరంజన్ కు సంబంధించినదని, వారిపై కేసులు కాకుండా చూస్తున్నట్లు సమాచారం. మొత్తానికి నాలుగు గంటలుగా ధనికులు నిర్వహించిన అధికారులు ఎటు తేల్చలేకపోయారు. విచారణ చేపడుతున్నామని సందనం ఇచ్చి జారుకున్నారు.

వాహనం ఢీ కొట్టడంతో బాలుడు మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



భీంగల్ మండలంలో మంగళవారం సాయంత్రం భీంగల్ నుండి సిరికొండకి వెళుతుండగా టాటా ఏస్ వాహనం ఢీకొని ఓ బాలుడు మృతిచెందాడు. డ్రైవర్ వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల నందిగల్లీ వద్ద రోడ్డు దాటుతున్న తోపారం నిశ్వంత్(7)ను ఢీకొట్టింది. తలకి బలమైన గాయాలు కాగా ఆర్మూర్ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా మార్గమధ్యలో చనిపోయినట్టు డాక్టర్ ధ్రువీకరించాడు. మృతుని తల్లి వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పెన్షనర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు పెన్షనర్లకు, ఉద్యోగులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మల్లు స్వరాజ్యం ట్రస్టు భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ డిఏ, ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల ట్రెజరరీలో పెండింగులో ఉన్న బిల్లులు, నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రులలో అమలు చేస్తామని చెప్పారని అన్నారు. పిఆర్‌సిని మంచి ఫిట్మెంట్ అమలు చేస్తామని, తదితర హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆయన తెలిపారు. పది నెలలైనా హామీలు నెరవేర లేదని, ఇప్పటికైనా చెల్లించాల్సిన నాలుగు డిఏలను, ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే అందించాలని వారు కోరారు. సమావేశంలో నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, జిల్లా ఉపాధ్యక్షులు లావు వీరయ్య, కోశాధికారి ఈవిఎల్ నారాయణ, కార్యదర్శి ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ క్యాంప్

నవతెలంగాణ-ముప్కాల్



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ క్యాంప్ 'శిక్షణ తరగతులు' మంగళవారం ముగిసినట్టు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు నును గొండ అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఈ నెల 3 నుంచి కబడ్డీ శిక్షణా తరగతులను ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించారన్నారు. సహకరించిన ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతె గంగారెడ్డి, టి.సాయన్న, చింతకింది ఉదయ్, కంచు నరేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా ప్రాంగణం పరిశీలన

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో ఈనెల 28వ తేదీన రాష్ట్రస్థాయి అండర్ 14 బాలికల ఖోఖో పోటీలను నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా ప్రాంగణం పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి గ్రామ అభివృద్ధి కమిటీతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు ప్రవీణ్, నర్సింలు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులకు రెంజల్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ దసరా పండుగను పురస్కరించుకొని మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వెంకటేష్ జాదవ్

ఎవరైతే మాకేంటి..

- అధికారులనూ లెక్క చేయని ఇసుక వ్యాపారులు
- బోధన్ డివిజన్‌లో జోరుగా ఇసుక అక్రమ దందా
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-బోధన్

ఇసుక అక్రమ రవాణా మాఫియా.. అధికారులను సైతం లెక్క చేయడం లేదు. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా అవేమీ పట్టించుకోవడం లేదు. ఒకరకంగా 'ఎవరైతే మాకేంటి' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు ఇసుక అక్రమదారులు.

గతంలోనే జిల్లాలో ఇసుక, మొరం దందా చేస్తున్న 400 మందిని గుర్తించి హెచ్చరించారు. కానీ నేతల అండదండలతో వారి దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. బోధన్ డివిజన్‌లోని మంజీరా పరివాహక ప్రాంతాలైన సిద్దాపూర్, ఖండ్‌గాం, సాలూర, హున్స, మంధర్న, సుంకిని, కారేగాం, పొతంగల్, కోడిచెర్ల గ్రామాల సమీపంలో నుంచి నిరంతరంగా రెవెన్యూ, పోలీసు అధికారుల కండ్లుగప్పి ఇసుక రవాణా చేస్తూనే ఉన్నారు.

మంజీర తీరంలో జోరుగా..


ట్రాక్టర్‌లో ఇసుక తరలింపు

జిల్లాలో మంజీర తీరం ఇసుక తవ్వకాలు.. రవాణాకు ప్రధాన అడ్డాగా మారింది. ఈ వ్యాపారం చేసేందుకు కొందరు డోజర్ లాంటి యంత్రాలు కొనుగోలు చేస్తే.. మరికొందరు ట్రాక్టర్లు, టిప్పర్లు కొని దందా సాగిస్తున్నారు. ఆగస్టు-సెప్టెంబరులో వరదలు వచ్చిన గతంలో డంప్ చేసిన ఇసుకను రెట్టింపు ధరలకు విక్రయించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మళ్లీ యథేచ్ఛగా యంత్రాలతో తోడి సమీప గ్రామ శివారుల్లో డంపులుగా పోస్తున్నారు. రాత్రి అయితే చాలు ఇసుకను పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. మంధర్న నుంచి నిత్యం ట్రాక్టర్లలో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులు పలుమార్లు పట్టుకుని కేసులు చేస్తున్నా.. దందాను మాత్రం ఆపడం లేదు. మల్టీజోన్-2లో అధికారులపై చర్యల నేపథ్యంలో జిల్లాలో ఇసుక మంజీర నది నుంచి ఇసుక తరలించి పొతంగల్ శివారులో నిల్వ చేస్తున్నారు. గతంలో రెవెన్యూ శాఖ అధికారులు ఇసుకను సీజ్ చేసిన సంధర్బాలూ ఉన్నాయి. అయినా ఇసుకడంపులు నిల్వ చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలకు మంజీరను పరిశీలించిన అధికారులు..

మంజీర తీరంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలకు అనుమతించాలని గత కొన్ని రోజుల క్రితం సంబంధిత శాఖ అధికారులు మంజీర నదిని పరిశీలించారు. ప్రభుత్వ అవసరాల ముసుగులో కొందరు రెవెన్యూ కార్యాలయాల్లో రూ.900 టోకెన్ తీసుకొని పదుల సంఖ్యలో ట్రిప్పులు తీసుకెళ్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారు స్థానిక అధికారులను మచ్చిక చేసుకోవడంతో ఆక్రమానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆరోపణలు వస్తున్నాయి. నామ్ కే వాస్తేగా పట్టుకొని జరిమానా వేయడం తప్ప పూర్తిస్థాయిలో ఇసుక కట్టడికి కార్యాచరణ చేయడం లేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక తవ్వకాల అనుమతుల సాధ్యాసాధ్యాలపై ఇటీవల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా కట్టడిలో వైఫల్యానికి బాధ్యులుగా ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై మల్టీ జోన్-2లో వేటు పడింది. కొంతకాలంగా నిఘా వర్గాల నివేదిక ఆధారంగా ఆ జోన్ ఐజీ వీరిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

బోధన్ డివిజన్ బాస్‌గా సబ్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టినా.. ఇసుక అక్రమ మాఫియా భయపడటం లేదు. అదును చూసి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ దందాలో మాజీ ప్రజాప్రతినిధులు, చోటామోటా లీడర్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబంలోని ఆడబిడ్డలను ఆర్థికంగా ఆదుకోవటానికి కల్యాణలక్ష్మి చెక్కులను మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్ రావు, బిజెపి మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు మనోజ్, నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు


ట్రాక్టర్‌తో భూమి చదును చేయిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్/భిక్కనూర్

మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో మంగళవారం సద్దుల బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో నగేష్ తెలిపారు. శుక్రవారం సద్దుల బతుకమ్మ ఉండడంతో పెద్దవాగు పరిసర ప్రాంతాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ కలిసి ట్రాక్టర్ సాయంతో చదును చేశారు. నిమజ్జనం రాత్రి సమయం పట్టడం వల్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందిని అక్కడ నిమజ్జనం జరిగే చోట ఉంచాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది బట్టు సాయిలు, మునీర్ తదితరులున్నారు.

బతుకమ్మ సంబురాలకు చెరువుల వద్ద భూమి చదును..

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలో బతుకమ్మ సంబురాల కోసం చెరువుల వద్ద మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ పంచాయతీ కార్మికుల చేత భూమి చదును చేయించారు. అలాగే చెరువుల సమీపంలో పిచ్చి మొక్కలు, ముళ్ళ చెట్లు లేకుండా శుభ్రం చేయించారు. చీకటి సమయంలో ఇబ్బందులు పడకుండా విద్యుత్ దీపాలను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబరాలలో భాగంగా గ్రామ ప్రజలు ఏవైనా సమస్యలుంటే పంచాయతీ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. అలాగే పెద్దమల్లారెడ్డి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి చెరువు సమీపంలో విద్యుత్ దీపాలను, పరిసర ప్రాంతాలను పంచాయతీ కార్మికుల చేత శుభ్రం చేయించారు.


పిచ్చిమొక్కల తొలగింపు

లక్ష్మీదేవి అవతారం

- సిర్‌పూర్ గ్రామంలో రూ.12,50,550తో దుర్గాదేవి అలంకరణ

నవతెలంగాణ-డొంకేశ్వర్

మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దుర్గమాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద మంగళవారం 6వ రోజు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రూ.12,50,550 నగదుతో అమ్మవారిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో దుర్గమాత స్వాములు, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



ప్రతి రైతుకూ పంట రుణం ఇవ్వాలి

- సింగిల్ విండో సిబ్బంది తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉన్న ప్రతి రైతుకూ పంట రుణాలివ్వాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ సింగిల్ విండో చైర్మన్‌కు డిసిసి బ్యాంక్ మేనేజర్ సూచించారు. సోమవారం సింగిల్‌విండోను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని సింగల్ విండోలో మాత్రం సింగిల్ విండో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. అందుకు అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాలని ఆయన సిబ్బంది తీరుపై మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ కాకపోవడానికి కారణం సిబ్బందేనని వివరించారు. రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగిల్ విండోలో ఉన్న ప్రతి రైతుకూ పంట రుణాలు ఇవ్వాలన్నారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాలు కచ్చితంగా ఇవ్వాలని ఆయన సూచించారు. అదేవిధంగా సింగిల్ విండోలో రైతులు సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఎంతమంది రైతుల రుణమాఫీ కాలేదో వాళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు సకాలంలో అందజేయాలని ఆయన సూచించారు. ఎన్‌డిసిసి బ్యాంక్ మేనేజర్ లావణ్య మాట్లాడుతూ.. రైతులకు పంట రుణం ఇవ్వాలని, ఎలాంటి షరతులు విధించవద్దని సూచించారు. రైతులకు ఇబ్బంది పెట్టినట్లయితే రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ప్రతి రైతుకూ సమాధానం చెప్పే బాధ్యత విండో సిబ్బందేనని అన్నారు. ఇక నుంచి ఇలాంటి తప్పులు చేయకూడదని ఆయన సూచించారు. సింగిల్ విండోస్ సిబ్బంది పాలకవర్గం సభ్యులు వారికి అనుకూలం ఉన్నవారి పేర్లను పంట రుణాలు అందిస్తున్నారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయని రైతుల పట్ల వివక్షత చూపవద్దని అన్నారు. ఆయన వెంట రైతులు కాంతం శ్రీనివాస్‌గౌడ్, సంగయ్య, అశోక్, రాజు, బైరయ్య, నగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పోషకాహార లోపం ఉన్న పిల్లలకు పరీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆర్‌బిఎస్‌కే టీం వైద్యులు మనోజ్, సాధన తెలిపారు. మంగళవారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఉన్న బస్తీ దావఖానా పరిధిలోని కంచర్ల, అయ్యవారిపల్లి గ్రామాలలో ఉన్న ఐదు సంవత్సరాల లోపు పిల్లలు, అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒక చిన్నారికి పౌష్టికాహార లోపం తీవ్రంగా ఉన్న కారణంగా నిజామాబాద్ ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటరమణ, ఫార్మసిస్ట్ యాదవ్‌గౌడ్, ఎంఎల్‌హెచ్‌పి పూజ, పీహెచ్‌ఎన్ రాణి, ఏఎన్‌ఎం శ్యామల, సూపర్వైజర్ సువర్ణ, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులున్నారు.

ఎంపీడీవో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పిట్లం

దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో గల పార్వతి దేవి ఆలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కమలాకర్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వదించారు. కాగా కమిటీ సభ్యులు ఆయన రాకను స్వాగతించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ యాదగిరి, నాయకులు రాము, నారాయణరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద పోతాంగల్ గ్రామంలోని కెనరా బ్యాంక్‌లో పోలీస్ కళాబృందం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వమించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. దసరా సెలవులకు ఇల్లు వదిలి వెళ్లినప్పుడు విలువైన వస్తువులు మీతో తీసుకొని వెళ్లాలని పోలీసులు సూచించారు. అత్యవసర సమయంలో ఇల్లు వదిలి వెళ్ళినప్పుడు చుట్టుపక్కల వారికి, పోలీస్ వారికి సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బాధితులు పై నెంబర్‌కు ఫిర్యాదులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బాలాజీ, రవి, పోలీస్ కళాబృందం ఇంచార్జి ప్రభాకర్, కళాబృందం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్ తెలిపారు. మంగళవారం భిక్కనూరు పట్టణ కేంద్రంలోని రేషన్ షాపుల ద్వారా గ్యాస్ సబ్సిడీ పత్రాలను అర్హులైన వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి, ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధరాములు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

మద్నూర్‌లో సద్దుల బతుకమ్మ

నవతెలంగాణ-మద్నూర్/లింగంపేట్/గాంధారి

మండల కేంద్రంలో మంగళవారం సద్దుల బతుకమ్మ పండుగను మహిళలంతా ఆనందంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో బతుకమ్మ పండుగ వాడవాడలో నిర్వహించడంతో సందడి నెలకొంది. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయా చెరువుల వద్ద గ్రామపంచాయతీ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. జిపి కార్యదర్శి సందీప్ కుమార్ పర్యవేక్షణలో బతుకమ్మ పండుగ ఉత్సవాలు చేపట్టారు.

అంగన్‌వాడీలో బతుకమ్మ పండుగ..

మండల కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో.సీడీపీవో కళావతి రాథోడ్, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో అట్ల బతుకమ్మ..

లింగంపేట్ :మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం అట్ల బతుకమ్మ ఉత్సవాలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడలి వద్ద పెట్టి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సమీపంలోని వాగుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

గాంధారి :మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో అట్ల బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు, యువతులు బతుకమ్మను తీరొక్క పువ్వులతో పేర్చి గ్రామంలోని కూడళ్ల వద్ద బతుకమ్మ ఆడి గాంధారి పెద్దవాగులో నిమజ్జనం చేశారు.


లింగంపేట్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


గాంధారిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మద్నూర్‌లో..

రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తా


మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న అధికారులు

నవతెలంగాణ-దోమకొండ

మండల పరిషత్ కార్యాలయంలో భిక్కనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజును మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు, సకాలంలో అందే విధంగా చూస్తానని, రైతుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సూపరింటెండెంట్ పర్యవేక్షకులు మనోహర్, సిబ్బంది శ్రీకాంత్, వెంకటేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిని కలిసిన నాయకులు

నవతెలంగాణ-రెంజల్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకమైన అంతిరెడ్డి రాజిరెడ్డిని యువజన కాంగ్రెస్ మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షులు కార్తీక్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి గైని కిరణ్ మాట్లాడుతూ.. ప్రతి మండలంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ లోక కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు మధు కృష్ణ, శ్రీకాంత్, గైని శివకుమార్, సురేష్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన స్నేహితులు

నవతెలంగాణ-భిక్కనూర్

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని నియమించడం పట్ల 1986-87 సంవత్సరానికి చెందిన తోటి స్నేహితులు చంద్రకాంత్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే కంచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చంద్రం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయగౌడ్ నూతనంగా నియమించిన గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శేఖర్ రెడ్డి, మహేందర్, స్వామి రెడ్డి, బాబు, తదితరులు పాల్గొన్నారు.


చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం ఏర్పాటు

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటాలను ఏర్పాటు చేయాలన్న ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్ హైమద్, ఏపీఓ రమణ, ఆఫీస్ సబార్డినేట్ బీరేందర్ సింగ్, వివేక్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

ఆర్యవైశ్య జిల్లా సంఘంలో నూతనంగా ఎన్నికైన సభ్యులను మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పురం రాజమౌళి మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ జిల్లా ఆర్యవైశ్య సంఘంలో జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన పబ్బ నాగరాజు, కార్యవర్గ సభ్యుడిగా రవీందర్, డైరెక్టర్‌గా వెంకటేశం నియమించడం పట్ల అభినందిస్తూ సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, బీజేవైఎం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.